సంక్షోభంలో ఆక్వా

- ఆక్వా ఉత్పత్తులపై అధిక పన్నులు
- గణనీయం తగ్గిన కౌంట్ ధరలు
- అధిక పెట్టుబడి, పెరిగిన విద్యుత్ బిల్లుల భారం
- తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్న ఆక్వారైతులు



అల్లవరం: విదేశీ మారకద్రవ్యం ఆర్జించి, దేశీయ స్థూల జాతీయ ఉత్పత్తిలో కీలక ప్రాత పోషిస్తున్న ఆక్వా రంగం నేడు సంక్షోభం దిశగా వెళుతోంది. ఆక్వా ఎగుమతులపై అగ్రదేశం అమెరికా విధించిన సుంకాలతో ఆక్వా రంగం, దాని అనుబంధ రంగాలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయే స్థితిలో ఉన్నాయి. భారత్ నుంచి ఎగుమతి చేసిన ఆక్వా ఉత్పత్తులపై ఇప్పటి వరకు 5 శాతం పన్ను మాత్రమే ఉండేది. భారత్ నుంచి అమెరికాకు 30. 40, 50 కౌంట్ రొయ్యలు ఎగుమతి చేసేవారు. ఈ కౌంట్ రొయ్యలపై అమెరికా 5 శాతం సుంకం విధించేది. చిన్న కౌంట్ రొయ్యలను ఇతర దేశాలకు ఎగుమతి అయ్యేవి. ఇటీవల అమెరికా ప్రభుత్వం ఆక్వా ఎగుమతులపై సుంకాల భారం మోపింది. గతంలో ఉన్న 5 శాతం పన్నును ఒక్కసారిగా 21 శాతానికి పెంచడంతో ఆక్వా రంగంలోని రొయ్యల ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో రొయ్యల ఎగుమతిదారులు కొనుగోళ్లను నిలిపివేశారు.

ఏటా ఆక్వా సాగులో పెరుగుతున్న ఖర్చులు

రొయ్యల ఉత్పత్తులపై అమెరికా విధించిన పన్నుల నేపథ్యంలో కౌంట్ రేట్లు ఒక్క సారిగా పడిపోయాయి. గడిచిన మూడు రోజుల్లో రొయ్యల ఉత్పత్తులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రొయ్యలను కొనేనాథుడు లేక ఆక్వా రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రొయ్యలు వైరస్ బారిన పడితే తీవ్ర నష్టాలు తప్పవు. దీంతో దిక్కు తోచని స్థితిలో ఆక్వా రంగం ఉంది. దీనికి తోడు రొయ్యలకు అందించే మేత, మందుల ధరలు గణనీయంగా పెరిగాయి. కూలీల ఖర్చు, డీజిల్ ధరలు పెరగడంతో, జనరేటర్ అద్దెలు ఆక్వాపై అధిక భారం తప్పడం లేదు. ఏటా 10 నుంచి 15 శాతం వరకు ఆక్వా సాగులో ఖర్చులు పెరుగుతున్నాయి. ఆ దిశగా లాభాలు రావడం లేదు. పెరిగిన ఖర్చులతో ఆక్వా రంగం సతమతమవుతోంది.

విద్యుత్ చార్జీలతో అదనపు భారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు భారీగా పెరిగాయి. సర్ చార్జీ, ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలతో అదనపు భారం ఆక్వాపై పడింది. సగటున రూ.10 వేలు ఉన్న కరెంట్ బిల్లు పెరిగిన అదనపు చార్జీలతో రూ.14 వేలు నుంచి రూ.15 వేల వరకు పెరిగింది. దీంతో ఆక్వా రైతుపై ప్రతి నెల అదనపు భారం తప్పడం లేదు.

ప్రస్తుత కౌంట్ ధరలు

కౌంట్	ధర
100 కౌంట్	రూ.200– 210
90 కౌంట్	రూ. 230
80 కౌంట్	రూ.240
60 కౌంట్	రూ. 290
50 కౌంట్	రూ. 320
40 కౌంట్	రూ. 340
30 కౌంట్	రూ. 400

కౌంట్ ధరలు పతనం

రొయ్యల ఉత్పత్తులపై అమెరికా విధించిన ఎగుమతి సుంకంతో దేశీయంగా కౌంట్ రేట్లు గణనీయంగా పడిపోయాయి. కేజీకి రూ. 50 నుంచి రూ. 60 వరకు రేట్లు తగ్గిపోయాయి. 30, 40, 50 కౌంట్లు రొయ్యల ధరలతో పాటుగా చిన్న కౌంట్లు ధరలు కూడా తగ్గాయి. గత నెల మార్చి 15 నాటికి 100 కౌంట్ ధర రూ. 240 ఉంది. ప్రస్తుతం 100 కౌంట్ ధర రూ. 190 నుంచి 205 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఇది మరింత తగ్గే అవకాశం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అమెరికా విధించిన సుంకాలను తగ్గించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోకపోతే ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్తుంది, తద్వారా ఆక్వా రైతులు నష్టపోతారు.

కరోనా వేళ ఆక్వా రంగాన్ని గట్టెక్కించిన జగన్

కరోనా మహమ్మారితో ఎక్కడికక్కడే ఆక్వా ఎగుమతులు నిలిచిపోవడంతో ఆక్వా రంగాన్ని కాపాడేందుకు అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రైతుల నుంచి రొయ్యల ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు కొనాల్సిందేనని ఆదేశించారు. దీంతో రొయ్యల రైతులను సంక్షోభం నుంచి కాపాడారు.

పన్నుల భారం పెరిగింది



అమెరికా విధించిన అధిక పన్నుల ప్రభావంతో ఇప్పటికే సంక్షోభంలో పడ్డాం. గడిచిన నాలుగు రోజుల్లో కేజీకి రూ.60 వరకూ నష్టపోయాం. పెద్ద కౌంట్ రొయ్యలే అమెరికాకు ఎగుమతి అవుతాయి. దీని ప్రభావం చిన్న కౌంట్ రొయ్యలపై కూడా పడింది. గతంలో 100 కౌంట్ రేటు కిలో రూ.250 ఉంటే నేడు రూ. 190 నుంచి రూ. 200 మాత్రమే కొంటున్నారు. రొయ్యల పట్టుబడికి వచ్చే సరికి మరింతగా ధరలు పడే అవకాశం ఉందని భావిస్తున్నాం. అదే జరిగితే రైతులకు తీవ్ర నష్టాలు తప్పవు.

– మంతెన సురేష్‌రాజు, ఆక్వా రైతు, కొమరగిరిపట్నం

క్లుప్తంగా

కామాక్షీ పీఠంలో శ్రీరామ పట్టాభిషేకం



కామాక్షీ పీఠంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తున్న పీఠాధిపతి కామేశ మహర్షి

అమలాపురం టౌన్: శ్రీరామనవమి సందర్భంగా అమలాపురంలోని కామాక్షీపీఠంలో పీఠాధిపతి కామేశ మహర్షి ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ బాల బ్రహ్మచారి విఘనస రాఖీ ప్రేమ్ బృందం, బ్రహ్మశ్రీ పూజ్యం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం వాసి కోళ్లపర్తి శివ రామారావు, సత్య దంపతులతో స్వామివారి పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. స్వామివారి పట్టాభిషేకాన్ని భక్తులు తరలివచ్చి తిలకించారు.

కిడ్నాప్ ఉదంతాన్ని ఛేదించిన పోలీసులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ పరిధిలో కొంకాపల్లికి చెందిన 9 ఏళ్ల బాలిక కిడ్నాప్ కేసును అమలాపురం పట్టణ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల సహాయంతో ఛేదించారు. అమలాపురం పట్టణ పరిధిలో కొంకాపల్లికి చెందిన 9 ఏళ్ల బాలిక కిడ్నాప్ కేసును పట్టణ పోలీసులు వేగవంతంగా విచారణ చేసి కిడ్నాప్ ఉదంతం మొత్తం అసత్యమని నిర్ధారించారు. ట్యూషన్‌కు వెళుతుండగా తనను ఐదుగురు వ్యక్తులు కారులో కిడ్నాప్ చేశారని, కిడ్నాపర్ల చెయ్యి కొరికి పోయానంటూ విద్యార్థిని చెప్పిందంతా అంతా కట్టు కథ అని పోలీసులు తెలిపారు. బాలిక తనకు తానుగా నడుచుకుంటూ వెళ్లిన దృశ్యాలను సీసీ టీవీలో నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.ఈ సాక్ష్యాధారాలను బాలిక తల్లిదండ్రులకు చూపించారు. కావాలనే బాలిక కిడ్నాప్ డ్రామాకు పాల్పడిందని విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ వీరబాబు, ఎస్సై కిషోర్‌బాబు సోమవారం వెల్లడించారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

అల్లవరం: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా పాఠశాల పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, షూలు, బెల్ట్, బ్యాగ్, డిక్షనరీని అందిస్తామని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు షేక్ అబ్దుల్‌గనీ అన్నారు. మండలంలోని అల్లవరం ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన స్టాక్ పాయింట్‌ను సోమవారం ఆయన జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యంతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా షేక్ అబ్దుల్ గనీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి ఒక్క విద్యార్థికీ విద్యాసామగ్రి కిట్లు అందిస్తామన్నారు. ఎంఈఓలు కిరణ్ బాబు, ఏడుకొండలు, పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వరరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

తాగునీరందించాలంటూ మహిళల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కామనగరువు ఎంఎస్ఎన్ కాలనీ మహిళలు

అమలాపురం రూరల్: తాగునీటి సమస్య తీర్చాలంటూ మండలంలో కామనగరువు పరిధిలోని ఎంఎస్ఎన్ కాలనీ మహిళలు సోమవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఈ అంశంపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనకు పంచాయతీ సిబ్బంది వేసిన కుళాయిల నుంచి నీళ్లు రావడం లేదన్నారు. పంచాయతీ అధికారులకు కాలనీ వాసులు పలుమార్లు కలిసి మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదని వాపోయారు. కాలనీలో దోమల బెడద అధికంగా ఉందని, దోమల నివారణకు పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని మహిళలు కోరారు.

పంట కాలువ నీరు రొయ్యల చెరువులకు తరలింపు

యానాం: నియోజకవర్గ పరిధిలో దొమ్మేటిపేట సమీపంలో పంట కాలువ నుంచి నీటిని కొంతమంది అనుమతి లేకుండా అక్రమంగా రొయ్యల చెరువులకు తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థాని దినేష్ అన్నారు. సోమవారం దొమ్మేటిపేట పంట కాలువ నుంచి ఆక్వా చెరువులకు నీటిని తోడేస్తున్న స్థలం వద్దకు వెళ్లి ఆయన పరిశీలించారు. ఈ పంట కాలువ ద్వారానే పొలాలకు సాగునీటితో పాటు దరియాలతిప్ప రక్షిత మంచినీటి చెరువుకు నీరు అందుతుందన్నారు. దొమ్మేటిపేట, సావిత్రినగర్, గిరియాంపేట తదితర తీర గ్రామాల ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని, మరోపక్క ఆక్వా చెరువుల యజమానులు నీటిని తరలించుకుపోతున్నారని ఆయన అన్నారు. అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బలగం గణేష్, వైదాడి శ్రీనివాస్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

కమనీయం వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో కల్యాణకర్తలు, అర్చకులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. ఈ వేడుక సోమవారం ఉదయం 8.58 గంటలకు వైభవంగా నిర్వహించారు. కోనసీమ వ్యాప్తంగా తరలివచ్చిన భక్తులు స్వామి వారి కల్యాణాన్ని ఆద్యంతం తిలకించి తరించారు. దేవస్థానం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జంగా అబ్బాయి వెంకన్న, ఉత్సవ కమిటీ సభ్యులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవానికి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. పట్టణానికి చెందిన ఇండిగెల శ్రీనివాసరావు, పద్మావతి, ఇండిగెల వీరభద్రారావు, నాగరాధాకృష్ణ కుమారి, ఇండిగెల రామాసూర్యవరప్రసాద్‌శాంతాదేవి దంపతులు బ్రహ్మశ్రీ సుదర్శన మురళీకృష్ణాచార్యులు, ఆలయ అర్చకులు పెద్దింటి సత్యనారాయణ ఆచార్యులు, పెద్దంటి లక్ష్మీనరసింహాఆచార్యులు, పాణికపల్లి సూర్యనాయణ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును జరిపించారు. ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. చాలా మంది దేవస్థానం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరలపై కల్యాణ తంతును తిలకించారు. ముత్యాల తలంబ్రాలు, అమ్మవారి గాజులను తోరం రాము దంపతులు భక్తులకు పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, ఈఓ యర్ర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు మోకా వెంకటసుబ్బారావు, దున్నాల వేణు, గన్నవరపు సూర్య భాస్కరరావు, దున్నాల దుర్గ, గోకరకొండ లక్ష్మణరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వేలాది మంది భక్తులకు దేవస్థానం తరపున ఉచిత ప్రసాద వితరణ, కల్యాణకర్తలు 10వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ ప్రతిపక్షం నేత ఏడిద శ్రీను, నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, భక్తులు పాల్గొన్నారు.

మీసాల వెంకన్న కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



పి.మల్లవరంలోని శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి (మీసాల వెంకన్న)

తాళ్లరేవు: పి.మల్లవరంలో వేంచేసియున్న శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి (మీసాల వెంకన్న) కల్యాణోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి రంగాచార్యులు, శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ గురువారం సదస్యం, 11వ తేదీ శుక్రవారం స్వామివారి రథోత్సవం, తీర్థం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు. 12వ తేదీ శనివారం తెప్పోత్సవం, 13వ తేదీ ఆదివారం శ్రీపుష్పోత్సవం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. ఆయా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

జోనల్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



క్రీడల్లో విశేష ప్రతిభకనబర్చిన మెట్టకూరు హైస్కూల్ విద్యార్థులు

యానాం: నియోజకవర్గ పరిధిలో మెట్టకూరు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు జోనల్ గేమ్స్‌లో విశేష ప్రతిభ కనబర్చారని సోమవారం విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, హెచ్ఎం రాజారామ్‌మోహన్‌రావు, పీఈటీ శేరు విష్ణు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అండర్–17లో షాట్‌పుట్, 100,200 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌లో ప్రథమ,ద్వితీయ స్థానాలను పొంది విశేష ప్రతిభ కనబర్చిందన్నారు. ఆకుల కస్తూరి రాజు లాంగ్ జంప్‌లో ద్వితీయ, పెమ్మాడి రామదాసు 400 మీటర్ల పరుగులో తృతీయ, ఆకుల ధర్మసంతోష్ హైజంప్, ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. అండర్–17లో ఆదిమూలం సాయికృష్ణ 400, 200, 600 మీటర్ల పరుగులో ప్రథమ, ద్వితీయ స్థానాలు, మల్లాడి గౌతమ్ షాట్‌పుట్‌లో తృతీయస్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. అండర్–14 బాలికల్లో బోడి మౌనిక హైజంప్, లాంగ్ జంప్‌లో ప్రథమ, ద్వితీయ, షాట్‌పుట్‌లో బోచాల చండీప్రియ ద్వితీయ స్థానాన్ని పొందారని తెలిపారు. అండర్–17లో కర్రి దేవి హైజంప్‌లో తృతీయస్థానాన్ని పొందారని పేర్కొన్నారు. వీరంతా 25 నుంచి నిర్వహించనున్న పుదుచ్చేరి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ శేరు విష్ణు తెలిపారు.

పాతకోరంగి శివాలయం రోడ్డుకు శంకుస్థాపన



పాతకోరంగి శివాలయం రహదారి అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ప్రజాప్రతినిధులు

తాళ్లరేవు: పాతకోరంగి బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ కురంగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారిని అభివృద్ధి చేసేందుకు ఎంపీపీ రాయుడు సునీత శంకుస్థాపన చేసారు. సోమవారం మండల పరిధిలోని కోరంగి పంచాయతీలో రూ.16 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ సునీత భూమి పూజ చేసారు. రూ.8 లక్షల మండల పరిషత్ నిధులతో పాటు రూ.6 లక్షల పంచాయతీ నిధులు, ఎమ్మెల్యే నిధులతో శివాలయం రహదారిని 12 అడుగుల రహదారిగా సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయనున్నట్లు నేతలు తెలిపారు. చినబొడ్డు వెంకటాయపాలెంలో రూ.8 లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు ఎంపీపీ భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల మంగేష్, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

చమురు, గ్యాస్ తవ్వకాల వల్ల పర్యావరణానికి ముప్పు



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం రూరల్: కోనసీమ ప్రాంతంలో చమురు, గ్యాస్ సంస్థల డ్రిల్లింగ్ వల్ల తాగు, సాగు నీరు కలుషితమై పర్యావరణం దెబ్బతిని, పంట పొలాలు నాశనం అయిపోతున్నాయని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌కు ఆయన పర్యావరణ ప్రతినిధులు రమేష్, రామకృష్ణ, గాబ్రియేల్‌తో కలిసి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ కుడుపూడి మాట్లాడుతూ 30 ఏళ్లుగా పర్యావరణ రక్షణ కోసం పోరాటం చేస్తున్నామని ఆయన అన్నారు కోనసీమలో గ్యాస్ అన్వేషణ 1980 నుంచి ప్రారంభమైందని, చమురు, గ్యాస్ సంస్థల తవ్వకాల వల్ల 7,645 చదరపు కిలోమీటర్ల పరిధిలోని గోదావరి, కృష్ణ డెల్టాలోని పర్యావరణం కాలుష్యమయమైందన్నారు. కాలుష్య నివారణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కోరారు.

వ్యవసాయ భూములను ఆక్వా జోన్‌లోకి మార్చొద్దు



ఆక్వా జోన్ గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ విజయలక్ష్మి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వానపల్లిపాలెం గ్రామస్తులు

అల్లవరం: వ్యవసాయ భూములను ఆక్వా జోన్‌లోకి మార్చవద్దని కొమరగిరిపట్నం గ్రామస్తులు కోరారు. మంగళవారం ఆక్వా జోన్‌పై నిర్వహించిన గ్రామసభలో స్థానికులు పలు అంశాలపై అధికారులను నిలదీశారు. ఆక్వా సాగుతో ఇప్పటికే వ్యవసాయ భూములకు సాగునీరు అందడం లేదని, ఉన్న కొద్ది పాటి వ్యవసాయ భూములను ఆక్వా జోన్‌లోకి మారిస్తే వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆక్వా జోన్‌పై సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన కొమరగిరిపట్నం గ్రామ సచివాలయం వద్ద ఎఫ్‌డీఓ అశ్విని ఆధ్వర్యంలో సోమవారం ఆక్వా జోన్ గ్రామసభ నిర్వహించారు. ఆక్వా జోన్‌పై మత్స్యశాఖ అధికారులు ఏర్పాటుచేసిన గ్రామసభలో పలువురు రైతులు అభ్యంతరం తెలిపారు. బెండా కాలువ -4 పరిధిలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందడం లేదని అన్నారు. మంచినీటి డ్రైను నుంచి ఊటగుంట సావరం వరకు పొలాలను రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ఆక్వా జోన్‌లోకి ఏలా మార్చారని ప్రశ్నించారు. సాగునీరు, తాగునీరు లేకపోయినా, డ్రైన్ నుంచి ఉప్పునీరు పంట పొలాల్లోకి వస్తున్నా అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై ఎఫ్‌డీఓ అశ్విని మాట్లాడుతూ గ్రామంలో 1,853 ఎకరాలో ఆక్వా సాగు చేస్తుండగా 1,375 ఎకరాలు ఆక్వా జోన్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన 477 ఎకరాల చెరువులను ఆక్వా జోన్ పరిధిలో చేర్చడానికి గ్రామసభ ద్వారా తీర్మానం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ దాట్ల గోపిరాజు, ఎంపీటీసీ మామిడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

ఆక్వా చెరువులు తొలగించాలని ధర్నా

అమలాపురం రూరల్: ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెంలోని మంగమ్మ పేట, తాత చెరువు, ఎల్ఐ గురువు, బొంతువారిపాలెంలో అక్రమంగా తవ్విన ఆక్వా చెరువులను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆక్వా చెరువుల వల్ల పంట పొలాలు దెబ్బతింటున్నాయని మహిళలు నినాదాలు చేశారు. బొంతు చిట్టిబాబు, బొంతు రామకృష్ణ, తదితరులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

అపరాలు పచ్చిరొట్ట సాగుతో భూసారం వృద్ధి



పి.మల్లవరంలో రైతులకు అపరాల విత్తనాల కిట్‌ను అందజేస్తున్న అధికారులు

తాళ్లరేవు: అపరాలు, పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ కరప సబ్‌డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.బాబూరావు తెలిపారు. పి.మల్లవరం పంచాయతీ గ్రాంటుతో గ్రామంలో సోమవారం నిర్వహించిన అపరాలు–పచ్చిరొట్ట పైరులపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ దాళ్వా పంట అనంతరం ప్రతి రైతు తప్పనిసరిగా తమ పంట పొలాల్లో అపరాలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయాధికారిణి ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి రైతూ తమ పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ పంపన రామకృష్ణ మాట్లాడుతూ గోవు ఆధారిత ప్రకృతి వ్యవసాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. కృషి అమృత్ గోవు ఆధారిత వ్యవసాయ క్షేత్ర రైతు ధూళిపూడి వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి రైతు కొంత భూమిని ప్రకృతి వ్యవసాయానికి కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న అపరాల కిట్‌లు, పీఎండీఎస్ కిట్‌లను రైతులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ మాధవి, వీఏఏలు అజయ్‌కుమార్, సుధ రైతులు పాల్గొన్నారు.

మహిళను వేధించడం దారుణం

తాళ్లరేవు: పల్నాడు జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న దళిత మహిళను లైంగిక వేధింపులకు గురిచేడం దారుణమని, ఈ ఘటనలో నిందితుడైన టీడీపీ నాయకుడు బొడ్డు వెంకటేశ్వరరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు సోమవారం డిమాండ్ చేశారు. మూడు నెలల క్రితం భర్త మృతి చెంది, ఇద్దరు పిల్లలను పోషించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తగా జీవనం సాగిస్తున్న దళిత మహిళను వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అమలాపురం రూరల్: అమలాపురం వేంకటేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా మంగళవారం రథం ప్రవేశించే ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. వేంకటేశ్వర స్వామి ఆలయం, పుల్లయ్య రామాలయం సెంటర్, గాంధీ బజార్, మాచిరాజు వీధి, రవణం వీధి, నల్లా వీధి, ఓల్డ్ ఫైర్ ఆఫీస్, గారపాటి వీధి, వెత్సవారి అగ్రహారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

ఆటంకాలు కల్పించినా అభివృద్ధే లక్ష్యంగా కృషి



సీసీ రహదారులు, డ్రెయిన్ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: ఎవరెన్ని ఆటంకాలు కల్పించినా తాను యానాం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు రూ.51 లక్షలతో వివిధ గ్రామాల్లో చేపట్టే పనులకు సోమవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో డంపింగ్ యార్డు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. సావిత్రినగర్, దరియాలతిప్ప, గుమ్మల్లా వీధి, స్టాబోర్డు కాలనీ, సంతోష్‌నగర్, వీకే కాలనీ, మెట్టకూరులో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, భూమి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు

యానాం: పట్టణ పరిధిలో కనకాలపేటలో ఈనెల 5నుంచి 9 వరకు నిర్వహిస్తున్న కోదండరామ స్వామి దేవస్థానం 78వ శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని 3వ రోజు సోమవారం రాత్రి కోకిలవాణి క్షేత్రం చిన్నారుల ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. స్వామికి విశేష అర్చన, నిత్యహోమం, మణి అండ్ పార్టీ వారితో హాస్యం, నృత్యం కలబోతతో ప్రదర్శించిన బుర్రకథ అలరించింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ, దేవస్థాన కమిటీ, శ్రీరామ, పోలేరమ్మ దేవస్థానాల కమిటీ సభ్యులు, యానాం పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సమస్యపై స్పందించని ఎన్‌హెచ్ అధికారులు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216 సుంకరపాలెం జంక్షన్‌లో మురుగునీటి సమస్యపై ఎన్‌హెచ్ అధికారులు స్పందించకపోవడంతో స్థానిక వ్యాపారులు తాత్కాలిక చర్యలు చేపట్టారు. కొన్ని రోజులుగా జంక్షన్ నుంచి ద్రాక్షారామ వెళ్లే రహదారిలో మురుగునీరు లీకై దుర్వాసన వెదజల్లడంతోపాటు అనేక మంది జారిపడి గాయాలపాలవుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో బైపాస్ శ్రీ లక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం సభ్యులు సిమెంటు వేసి తాత్కాలికంగా లీకులను అరికట్టారు. తక్షణమే హైవే అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వర్తక సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

శ్మశాన వాటిక ఆక్రమణను అడ్డుకుంటాం

యానాం: స్థానిక బైపాస్ రహదారి చెంతనే ఉన్న భీమ్‌నగర్ దళితుల శ్మశాన వాటికను ఆక్రమించి మట్టితో పూడ్చి చేపలు విక్రయానికి షాపులు నిర్మించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని, దానిని ఐక్యంగా ఎదుర్కొంటామని భీమ్‌నగర్, వికాస్ కాలనీ, సిద్ధార్థనగర్ తదితర గ్రామాల దళితులు హెచ్చరించారు. సోమవారం శ్మశాన వాటిక వద్ద వారు మాట్లాడుతూ ఇప్పటికే శ్మశాన వాటిక ఆవరణలోనే డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడంతో చాలా వరకు స్థలం ఆక్రమణకు గురైందన్నారు. వరదల సమయంలో శ్మశానవాటిక ముంపునకు గురవుతుందని దీంతో ఆ సమయాల్లో మృతదేహాలను ఖననం చేయడానికి తీవ్ర ఇబ్బందులును ఎదుర్కొంటున్నామన్నారు. యానాంలో అతిపెద్ద చేపల మార్కెట్ భవనం ఉందని అక్కడ కాకుండా శ్మశాన వాటిక చెంతనే చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పువ్వల ప్రసాదరావు, లంక బంగారం, పువ్వల విద్యాసాగర్ పాల్గొన్నారు.

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి

ఉప్పలగుప్తం: ఉపాధి పనులు చేస్తూ వడదెబ్బకు గురై ఉపాధి కూలీ మృతి చెందింది. సన్నవిల్లికి చెందిన తొత్తరమూడి కాంతమ్మ (59) సోమవారం గ్రామంలోని ఉపాధి పనులకు వెళ్లి వడదెబ్బకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అమలాపురం ఏరియా ఆసుపత్రికి ఆమెను తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కాంతమ్మ మృతి చెందింది. సర్పంచ్ చిక్కం పెదబాబు, ఉపాధి ఈసీ, ఎం.వీరబాబు, ఆసుపత్రిలో కాంతమ్మ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

వివాహిత ఆత్మహత్య

అల్లవరం: తూర్పులంకలో ఆదివారం మధ్యాహ్నం పుట్టింట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వివాహిత ప్రవీణ (27) ఆత్మహత్యకు పాల్పడింది. ఏడాది క్రితమే ఆమె పెళ్లి చేసుకుని గుజరాత్‌లో అత్తవారింట్లో భర్తతో ఉంటోంది. కామెర్ల వ్యాధితో బాధపడుతూ నెల రోజుల క్రితం తూర్పులంకలోని పుట్టింటికి వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఆమె భర్త గుజరాత్‌లో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ పని ఒత్తిడి పెరగడం, తల్లిదండ్రులకు దూరంగా ఉండడంతో ఒంటరితనాన్ని భరించలేక మనస్థాపంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై తిరుమలరావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.